# నాకు నచ్చిన కథ - "మరో ఆకలి కథ"

– శ్రీధర శ్రీరామకృష్ణ

ఎవరికైనా నచ్చిన కథలు చాలా ఉంటాయి. వాటిల్లో కొన్ని చదువుతున్నంత సేపూ బాగున్నట్లనిపిస్తాయి. కానీ అతి త్వరలోనే మెదడు పొరల్లో మరుగున పడిపోతాయి. మరికొన్ని చదివిన కొన్ని గంటల వరకూ, కొండొకచో కొన్ని రోజుల వరకూ మనసులో ఒక రకమైన ఆలోచననో, అనుభూతినో, అలజడినో, అలాంటిదే మరో రకమైన భావననో కలిగిస్తాయి. కానీ కాలచక్రం గిరుక్కున తిరుగుతూ ఉంటే, జ్ఞాపకాల పుటల్లోంచి వాటి తాలూకు ముద్ర క్రమేపీ చెరిగిపోతూ, కొంత కాలానికి పూర్తిగా అంతరించిపోతుంది. ఇంకొన్ని కథలుంటాయి. సంఖ్యలో అవి బాగా తక్కువగా ఉంటాయి. కానీ, ఒకసారి చదివింతర్వాత, వాటిని చదివిన అనుభూతి ఒక మంచి స్నేహితుడిలా జీవితాంతం మనతో బాటే ఉంటుంది. మంచి కథల ప్రసక్తి ఎక్కడైనా వస్తే, మన నోటి నుంచి అసంకల్పితంగా అది బయటకు వస్తుంది. మొదటి సారి దాన్ని చదివినప్పుడు కలిగిన అనుభూతి పునర్నవమై మనసును మరోసారి పులకింపజేస్తుంది. అలాంటి కోవకి చెందినదే ఈ మరో ఆకలి 'కథ'. కథకులు శ్రీ వీరభద్రరావ్ పమ్మి.

ఈ కథ 1975లో 'ఆంధ్రప్రభ' సచిత్ర వార పత్రికలో ప్రచురింపబడింది. అప్పటికి నాకు పద్నాలుగేళ్ళు. ఎందుకో తెలియదు గాని అప్పట్లోనే అది నాకు బాగా నచ్చింది. ఎంత బాగా నచ్చిందంటే, 'నేను కూడా ఇలాంటి మంచి కథలురాయాలి' అన్న ప్రేరణను నాలో కలిగించింది. కానీ కథ ఎందుకు బాగుందో విశ్లేషించుకునేటంతటి వయో,మానసిక పరిపక్వత అప్పటికి నాకు లేదు.

కానీ, చిత్రంగా 'నాకు నచ్చిన నా కథ' శీర్షికన జనవరి, 82 'యువ' మాస పత్రికలో పునఃప్రచురింపబడ్డ అదే కథను నేను మళ్ళీ చదవటం తటస్థించింది. నాకు నచ్చిన ఆ కథే కథకునికి నచ్చిన తన కథ కావటం నాకు కొంచెం ఆశ్చర్యాన్ని కలిగించింది. ఇది కేవలం యాదృచ్ఛికం కావచ్చు.

ఇక, ఈ కథ నాకు ఎందుకు నచ్చిందో వివరిస్తాను.

ఆకలి బాధ ఎంత భయంకరమైనదో దాన్ని స్వయంగా అనుభవించిన వారికే తెలుస్తుంది.

తనువును అమ్ముకుని తద్వారా ఆకలి తీర్చుకునేటంతటి దౌర్భాగ్యకర పరిస్థితి బహుశా జీవన గమనంలో మరోటి ఉండదేమో !

అలాంటి భయంకరమైన బాధ, దౌర్భాగ్యకర పరిస్థితి ఈ 'కథ' నాయిక సత్యవతికి కలిగాయి. ఆకలి తీరాక, ఆకలిని తీర్చిన ఆ మనిషికి తనను తాను అర్పించుకోవాలన్న సత్యవతి నిజాయితీ, ఆమె ఆ తాపత్రయానికి మూలం ఆకలే కదా అన్న 'కథ' నాయకుని ఆలోచనా పరిణతి ఈ కథలో నాకు నచ్చాయి. ఇక, కథనంలో పరిపక్వత, రచయిత జీవితాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసారనటానికి నిదర్శనగా కథలోని కొన్ని వాక్యాల ఆణి ముత్యాలు సరే సరి.

ముఖం పీక్కుపోయి, కళ్ళు లోతుకుపోయి, జుట్టంతా చెదిరిపోయి, చీరమాసిపోయి ఉన్నా 'సత్యవతి అందంగానే ఉంది. పోషణలేని గొప్పింటి బిడ్డలా ఉంది' అనుకుంటాడు 'కథ' నాయకుడు.

నిజమేగా మరి ! గొప్పింట్లో కాక పోయినా, కనీసం అప్పర్ మిడిల్ క్లాస్‌లో పుట్టున్నా 'సత్యవతి స్థితి ఖచ్చితంగా అలా కాక మరోలా ఉండేది.

బద్దలైన అగ్నిపర్వతంలాగ, రగలుతున్న విప్లవంలాగ ఉందట ఆమె ఆకలి. అందుకే కంచంలోని పదార్థాలని ఇరవై లంఖణాలు చేసిన దానిలా చూసింది.

ఎంత చక్కటి ఎక్స్‌ప్రెషన్ !

ఆమె ఆకలి తీర్చుకుంటున్నప్పుడు, అతను కళ్ళార్పకుండా చూస్తూ కూర్చుంటే, ఆమె కళ్ళల్లో నీళ్ళు నిండాయి.

సహజమే మరి !


అవి ప్రపంచంలో బాధితులు, పీడితులు కల్సి కార్చిన కన్నీటి చుక్కల్లా కనిపించాయి.


ఎంతటి దృష్టి వైశాల్యం !

చివరిగా కథకులు అంటారు 'మానవునికి ప్రాకృతికమైన ఒకే ఒక్క కోరిక ఆకలి. అది భయంకరమైనదే కాదు. ఘోర మైనది, బాధాకరకమైనది కూడా. మానవుని మిగతా కోరికలన్నీ మానసికమైనవి' అని.

ఒక్క నిముషం ఆలోచించి చూడండి. ఈ పై వాక్యాలు అక్షర సత్యాలని మీకూ అనిపించకపోదు.

చివరికి, 'కథ' నాయకునికి చలి తగ్గటం, వెంటనే నిద్ర పట్టేయటం 'ఆకలి' తాలూకు ఆలోచన చేసిన చిత్రం కాదూ ! కథ చదివి మీరే నిర్ణయించండి.





# మరో ఆకలికథ.

పమ్మి వీరభద్రరావు

ఆఫీస్ ఫంక్షన్ జరగడానికి యింకా పదిరోజులుంది.

నాటకం రిహార్సెల్ నా ఊపిరి పీల్చేస్తూంది.

ఛీ! ఇంకెప్పుడూ ఈ వెధవలతో నాటకా లెయ్యకూడదు. అయినా, ఇలా ఇదివర కెన్నిసార్లనుకోలేదు ?

ఈరోజు రిహార్సెల్‌లో నాకు చిరాకు, కోపం, నీరసం, ఉడుకుమోత్తనం, ఏడుపు - అన్నీ కలగాపులగంగా వచ్చాయి.

రావుగాడు మరీ వెధవ.

ఎప్పుడూ టైముకి రాడు.

ఎన్నడూ చెప్పిన మాట వినడు.

తీరా స్టేజి ఎక్కేసరికి దడా, వణుకూ, వాడో పెద్ద నటుణ్ణనుకుంటాడు.

ఇదంతా నా ఖర్మ.

మా ఆఫీసులో అంతకన్నా నాటకాలేసే మనుషులే లేరు. వాడి మీద ఎప్పుడేనా చిరాకువడితే "నువ్వొక్కడివే చేనుకో"! అంటాడు.

వాడితో ఈ రోజు పెద్ద యుద్ధమై పోయింది.

అసలు దీనికంతా కారణం సుమిత్ర.

దాని కసలు బుద్ధిలేదు.

పోనీ, గోలెడుతూందని దీపావళికి పుట్టింటికి పంపిస్తే పండుగై పోగానే వచ్చెయ్యద్దూ ?

**మానవునికి ప్రాకృతికమైన కోరిక ఒక్కటే - ఆకలి. అది ఘోరమైనది, భయంకరమైనది. బాధాకరమైనది. మిగతా కోర్కెలన్నీ మానసికమైనవి.**

"మా అమ్మకి నీరసంగా ఉంటుంది. పెద్దాదిన నీళ్లోసుకుని పుట్టింటి కెళ్ళింది. చెల్లాయికి కాలేజీ చదువు. చిన్నాదిన మామూలు గానే సంవత్సరంలో సగభాగం పైగా పుట్టింట్లోనే ఉంటుంది కదా? కాబట్టి నాన్నగారి బలవంతం మూలాన మరో నెల్లాళ్ళు ఇక్కడుంటున్నాను. ప్రియమైన శ్రీవారూ! అనుమతిస్తారు కదూ?' అంటూ వ్రాసింది.

మధ్యాహ్నం ఆఫీసులో ఆ ఉత్తరం అందుకున్నప్పట్నుంచి నా కసలు మూడ్సు బాగా లేవు.

సుమిత్ర మిద జన్మలో ఎప్పుడూ రానంత కోపం వచ్చేసింది. (అఫ్ కోర్స్ ! మా పెళ్ళయి ఇంకా సంవత్సరం కాలేదు.)

స్టుపిడ్ ! ఇంకెప్పుడూ ఛస్తే పుట్టింటికి పంపను.

వారం రోజులుగా వస్తుందని ఎదురు చూస్తున్నాను.

రోజూ పాలు ఎక్స్ట్రా పోయించుకుని ఉదయం ఎనిమిది గంటలదాకా వచ్చీ పోయే ప్రతి ఆటోని శ్రద్ధగా పరికిస్తున్నాను.

ఒక్కటీ మా ఇంటిముందాగదు.

సుమిత్ర దిగదు.

రాత్రిళ్ళు నాకు నిద్రపట్టదు.

అయినా, వాళ్ళ పెద్దవాళ్లకేనా బుద్ధుండొద్దూ ?

మా పెళ్ళయ్యాక సగం రోజులు అక్కడే ఉంది.

పోనీ, ఒకసారి పోయివద్దామంటే ఈ నాటకం ఒకటి నా ప్రాణానికి.

ఏ జంట చక్కగా వెడుతున్నా వెంటనే సుమిత్ర గుర్తుకొచ్చేస్తూంది.

అయినా, పెళ్లికాకముందు ఎన్ని సంవత్సరాలు ఒక్కణ్ణీ ఉండలేదు ? ఎప్పుడేనా అమ్మమీద కాని, ఇంటిమీద కాని బెంగపడ్డావా ?

మరి ఒప్పుడు ?

ఏమిటీ మార్పు ?

శ్రీదేవి వదిన పుట్టింటి కెడితే వారం తిరక్కుండానే అన్నయ్య గుంటూరు బస్సు ఎందుకు ఎక్కేసేవాడో ఇప్పుడర్థమౌతుంది.

కార్తీకమాసం మూలంగా చలి కుది పేస్తూంది.

దారుణమైన చిక్కని చలి.

నాకైతే మరీ ఘోరంగానూ భయం కరంగానూ అనిపిస్తూంది.

సుమిత్ర లేనిదే ఒక్కణ్ణీ ఈ చలిని భరించలేననిస్తూంది.

రిహార్సల్ నుంచి బయటికొచ్చిన భాస్కరం అడిగాడు !

"ఏమిటి, ఈ వేళ నీ మూడ్ బాగాలేదు ?"

"ప్రత్యేకంగా కారణమేమీ లేదు."

"అన్నట్టు మీ మిసెస్ నుంచి లెటరొచ్చిందా ?"

"మరో నెల్లాళ్ళు అక్కడే వుంటుందట."

"ఐసీ! మూన్‌లాండ్‌కి పోదాం - రారాదూ ? మంచి కేబరే ఉంది. ప్రీతి ప్రమ్ బాంబే చేస్తూంది."

సుమిత్ర మీద కసి తీర్చుకోవాలనిపించింది.

"నడు" అన్నాను.

కేబరే బాగుంది.

బాగా ఎంజాయ్ చేశాం. ఇద్దరం చెరో క్వార్టరూ విస్కీ బిగించాం. అక్కడున్న కాస్పేపు హాయిగా ఫీలయ్యాను.

నన్నింటి దగ్గర తన స్కూటర్ మీద డ్రాప్ చేస్తానన్నాడు భాస్కరం. వద్దన్నాను.

రవీంద్రభారతి దగ్గర వదిలేసి తను నారాయణ గూడా వెళ్ళిపోయాడు.


బార్ లోంచి బయటపడ్డాక చలి మరీ ఎక్కువయింది.

డాన్స్ చూసినప్పటి నుంచి మనస్సులో చలి మొదలయింది.

అసెంబ్లీకెదురుగా జాంజాం కేఫ్ దగ్గర నిలబడ్డాను. రిక్షాలు, ఆటోలు ఏమీ లేవక్కడ.

రోడ్డంతా నిర్మానుష్యంగా ఉంది.

నేనక్కడ నిలబడ్డాక కొన్ని క్షణాలకు



గాని చూడలేదు.

చీకట్లో కళ్ళు పెద్దవి చేసుకుని చూశాను.

ఒక యువతి గోడపక్కగా నిలబడింది.

ముదురు రంగు చీరలో కొంగు నెత్తిమీదుగా కప్పుకుని గోడకు జేర్లబడి నిలుచుంది.

దగ్గరగా చూస్తే ఆమె బాగా ఉందని పించింది.

టైమ్ చూశాను. పన్నెండూ పది.

ఇప్పుడామె అక్కడెందుకు నిల బడినట్లు ?

బస్సులు వచ్చే టైమ్ దాటిపోయిందే ?

కొంచెం అర్థమైంది నాకు.

కొన్ని క్షణాలాగి ఆమెకు దగ్గరగా వెళ్ళాను.

"మీరెక్కడికి వెళ్ళాలి?" నేనే అడిగాను.

"కోఠీ."

"మీ రొచ్చాక బస్సేదీ రాలేదా ?"

ఆ సమయంలో బస్సు రాదని తెలిసీ అడిగాను.

"లేదు."

ఇంకొంచెం అర్థమైంది.

"మీ రెక్కడికి వెళ్ళాలి?" ఆమె అడిగింది.

"సుల్తాన్ బజార్."

నేనింకేమీ మాట్లాడలేదు.

ఖాళీ ఆటో వెడుతూంది. నేను పిలవకుండా తనే స్లో చేశాడు. అప్పుడు పిలిచాను.

ఆటో వచ్చి నా ముందాగింది.

మళ్ళీ ఆమె దగ్గరి కెళ్ళాను.

"వస్తారా ?"

"ఎక్కడికి ?"

"మా ఇంటికి".

"మీ ఇంటికా ?" భయంగా అంది.

"ఫరవాలేదు. ప్రస్తుతం మా ఇంట్లో ఇంకెవరూ లేరు."

ఆమె ఏమీ మాట్లాడలేదు.

ఆమె ఇంకేమీ ఆలోచించలేదు.

ఆటోలో నా పక్కన కూర్చుంది.

నిర్జనంగా ఉన్న రోడ్డుమీద ఆటో స్పీడుగా పోతూంది. చలిగాలి రయ్‌మని వీస్తూంది.

నేను వేసుకున్న స్వెట్టర్ చలి నాప లేకపోతూంది.

తాగిన మందు శరీరాన్ని వేడెక్కించ లేకపోతూంది.

ఆమె భుజం మీద చెయ్యి వేశాను.

ఆమె ఏమీ మాట్లాడలేదు.

"నీ పేరేమిటి ?" నే నామెను స్వంతం చేసుకున్నట్టు ఫీలవుతూ ఏకవచనంతో అడిగాను.

"సత్యవతి."

"ఇంత రాత్రి అక్కడ నిలబడ్డావేం ?"

"పబ్లిక్ గార్డెన్ నుంచి వస్తున్నాను."

అక్కడి కెందు కెళ్ళావని నేనగడలేదు.

ఆమే మళ్ళీ చెప్పింది.

"ఓ స్టూడెంట్ రమన్నాడు. వెళ్ళాను. అయిదు రూపాయిలు చేతిలో పెట్టి ముగ్గురు వెధవలు పంచుకోబోయారు. ఇంతలో వాచ్‌మన్ వచ్చాడు. వాళ్ళు కోఠీ పారిపోయారు. నేను దొరికిపోయాను. లక్ష ప్రశ్నలు వేసి పోలీసుల కప్పజెప్పుతానని బెదిరించి అయిదూ లాక్కున్నాడు."

ఆమెను దగ్గరగా తీసుకున్నాను.

చలికి ఒదిగిపోయి కూర్చుంది.

బుగ్గమీద ముద్దెట్టుకున్నాను.

"తాగారా?" అని అడిగింది.

"ఊ !" అన్నాను.

"రోజూ తాగుతారా ?"

"లేదు - ఎప్పుడైనా ?"

పెదాలు అందుకోబోయాను.

"ఇంటి కెడుతున్నాంగా ఖంగారెందుకు?" అంది.

ఆమెను వదిలేసి దూరంగా జరిగాను.

ఇంటి కెళ్ళాక లైటు వెలుతురులో గాని చూడలేదు- ఆమె ముఖం పీక్కుపోయింది. కళ్ళు లోతుకుపోయాయి. జుట్టంతా చెదిరి పోయింది. చీర మాసిపోయి అక్కడక్కడ చిరిగింది. భుజం మీద పిగిలిపోయిన జాకెట్టు చీర కొంగుతో కప్పుకుంది.

ఏమైనా సత్యవతి .... అందంగానే ఉంది. పోషణలేని గొప్పింటి బిడ్డలా ఉంది.

"స్నానం చెయ్యాలి ....... నీళ్ళు న్నాయా !" అని అడిగింది.

బాత్‌రూమ్‌లో చన్నీళ్ళున్నా యన్నాను.

ఫరవాలేదంది.

సుమిత్రవి చీర, జాకెట్టు తీసి ఇచ్చాను.

అనుమానంగా చూసిందామె.

"ఫరవాలేదు. తీసుకో" అన్నాను.

ఆమె బాత్‌రూమ్‌లో కెళ్ళాక వీధితలుపు తాళం పెట్టి దిల్‌షాద్ టాకీస్ దగ్గరికెళ్ళి కిళ్ళీలు తీసుకుని పువ్వులు, సిగరెట్లు కొనుక్కున్నాను.

తిరిగి వచ్చే సరికి సత్యవతి తల దువ్వుకుంటూంది. తెల్ల చీరలో పువ్వు లెట్టుకుని అభిసారికలా తయారయింది.

ఎదురుగా కుర్చీలో కూర్చుని, "మీదే ఊరు?" అనడిగాను.

"అవన్నీ తరువాత చెబుతాను కానీ - తినడానికేమైనా ఉందా ?" అని అడిగింది.

ఆ అడగడంలో సిగ్గు, అభిమానం, మొహమాటం, ఆకలి కలిసి మడతలుగా బయటికొచ్చాయనిపించింది నాకు.



"నువ్వు భోజనం చెయ్యలేదా ?" అనడిగాను.

"అన్నం తిని మూడు రోజులయ్యింది." నేలకేసి చూస్తూ అంది.

"మరిందాకటి నుంచీ చెప్పలేదేం ?"

"అయితే, ఏమీ లేదా ?" నిరాశగా, ఆత్రంగా అంది.

"పొద్దున వండిన అన్నం ఉంది- తింటావా ?" అనడిగాను.

"నిన్నటిదైనా ఫరవాలేదు.

ఆమె ముఖం చూస్తే చాలా బాధగా అనిపించింది నాకు.

ఆ కళ్ళలో ఆకలి సుళ్ళు తిరిగింది.

వంటింట్లోకి వెళ్ళి కుక్కర్ తీసి చూశాను.

అన్నం చాలా ఉంది. ఈ పూటకి కూడా ప్రొద్దున్నే వండుకున్నాను. కొంచెం కూర కూడా ఉంది.

అన్నం, పచ్చడి, మజ్జిగ, కూర డైనింగ్ టేబుల్ మీద పెట్టాను.

కృతజ్ఞతా పూర్వకంగా కళ్ళలోకి చూసిందామె.

ఆమెకెదురుగా కుర్చీలో కూర్చున్నాను.

తాను వడ్డించుకుంటూ అంది.

"మీరు తినరా ?"

"వద్దు - బార్‌లో పరోటా, ఆమ్లెట్ తిన్నాను. ఆకలి లేదు."

"నాకు మాత్రం చాలా ఆకలిగా ఉంది సుమా !" తన కోర్కెను తాను సమర్థించుకునే ప్రయత్నంలా కనుపించింది.

కంచంలో పదార్థాలన్నింటినీ ఇరవై లంఖణాలవాడు భోజనానికి కూర్చునేముందు చూసినట్లు చూసింది.

బద్దలైన అగ్ని పర్వతంలాగ, రగులుకున్న విప్లవం లాగ ఉంది ఆమె ఆకలి.

మళ్ళీ నెలదాక భోజనం దొరకదన్నట్లు ఆమె తినడం ప్రారంభించింది.

నేను కళ్ళార్పకుండా చూస్తూకూర్చున్నాను.

మధ్య మధ్య ఆమె కూడా నాకేసి చూస్తోంది.

ఆ చూపులో యుగయుగాలుగా మనుష్యులందరూ ఉమ్మడిగా అనుభవించిన దైన్యం కనిపిస్తోంది. ఆమె కళ్ళలో నీళ్ళు నిండాయి. అవి ప్రపంచంలో బాధితులు, పీడితులు అంతా కలసి కార్చిన కన్నీటిచుక్కల్లా కనుపించాయి.

మూడు రోజులు క్రితం కాదు, మూడు సంవత్సరాల నాడు ఆమె భోజనం చేసి ఉంటుందన్న అనుమానం వచ్చింది.

ఆమె .. ఆశగా ...ఆబగా.. అసహ్యంగా .. అన్నం తింటూంది.

ఆకలి తీర్చుకుంటూంది.

ఆమెలో అంత ఆకలిని చూశాక నాలో ఆకలి పూర్తిగా చచ్చిపోయింది.

వెంటనే లేచి డ్రాయింగ్ రూమ్‌లో కొచ్చేశాను.

సోఫాలో కూర్చుండిపోయాను.

ఆమె వంటిల్లంతా సర్దేసి, తలుపేసి, చేతులు కొంగుతో తుడుచుకుంటూ వచ్చి సోఫాలో నా పక్కన కూర్చుంది.

"హమ్మయ్య ... హాయిగా అన్నం తిన్నాను. రాత్రంతా ఇక మీదాన్నే" అంది దగ్గరగా జరుగుతూ.

చటుక్కున లేచి నిలబడ్డాను.

జేబులో ఉన్న పాతిక రూపాయలు ఆమె కందిస్తూ, "నువ్వీ సోఫాలో పడుకో. ఈ డబ్బు నీ దగ్గర ఉంచుకో. తెల్లారి నేను లేచేసరికి ఇక్కణ్ణుంచి వెళ్ళిపో. దయుంచి మళ్ళీ నాక్కనబడకు" అని ఆవేశంగా అన్నాను.

ఊహించని ఈ పరిణామానికి ఆమె ఆశ్చర్యపోయింది. తెల్లబోయింది. ఆమె మాట్లాడబోయింది.

నేనామెకా అవకాశం ఇవ్వకుండా బెడ్‌రూమ్‌లోకి వెళ్ళిపోయాను.

తలుపేసుకున్నాను.

మంచం మీద పడుకున్నాను.

మనస్సు తేలికపడినట్లనిపించింది.

మానవునికి ప్రాకృతికమైన కోరిక ఒక్కటే - ఆకలి.

అది ఘోరమైనది, భయంకరమైనది, బాధాకరమైనది.

మిగతా కోర్కెలన్నీ మానసికమైనవి.

అంతకన్న ఎక్కువ ఆలోచించ లేకపోయాను.

నాకు చలి తగ్గినట్లనిపించింది.

వెంటనే నిద్ర పట్టేసింది.

*





## రాయడం మానేశా !

వేటూరికి ఓసారి జుట్టు సమస్య వచ్చింది. వుంది తెల్ల జుట్టు. పైగా రాలిపోతోందిట. ఆత్రేయ గారి దగ్గరికి వెళ్ళారట. ఆత్రేయ ఓ మందిచ్చారు.

అది వాడినా ఫలితం కనిపించలేదు వేటూరికి అప్పటికే వేటూరి స్పీడుగా దూసుకు పోతున్నారు సినిమా లోకంలో -

"గురువు గారూ, మీరు ఇచ్చిన మందు వాడినా ఫలితం లేకపోయింది. ఇంతకూ ఆ మందు మీరు రాస్తున్నారా ? లేదా ?"

"లేదు, వేటూరీ, నువ్వు రాయడం మొదలెట్టాక నేను మానేశాను" అన్నారు శ్లేషధ్వనిస్తో. ఆత్రేయ !